అనారోగ్యంతో విక్టర్ బాబు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

దళిత ఉద్యోగుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి, ప్రముఖ సమాజ సేవకుడు బొడ్డు విక్టర్‌బాబు అనారోగ్యంతో గురువారం ఆయన స్వగృహం వద్ద మృతి చెందారు. ఈ సందర్భంగా నెగ్గిపూడిలోని మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ తరపున సంతాపం వ్యక్తం చేశారు. సంస్థ అధ్యక్షులు కె.మురళీశ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విక్టర్‌బాబు ఈ సమాజానికి ఎనలేని సేవలు చేశారని, ప్రజల చేత ఎన్నో మన్నలను పొందారని తెలిపారు. అలాంటి దార్శనికుడు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. విక్టర్ బాబును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. ముందుగా విక్టర్ బాబు భౌతికకాయానికి సాక రాజు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నక్కా నరేష్ కుమార్, బండి ప్రసాద్ పాల్గొన్నారు

మంత్రులు అయ్యేదెవరో..!

రెండు జిల్లాల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

ప్రముఖంగా పితాని, రామానాయుడు పేర్లు

రఘు రామకృష్ణంరాజుకు

స్పీకర్ పదవి అంటూ ప్రచారం

బిజెపి కోటాలో కామినేనికి దక్కే అవకాశం

ఎవరికి వారు కీలక నేతలతో ముమ్మర ప్రయత్నాలు


పితాని సత్యనారాయణ

నిమ్మల రామానాయుడు


కె.రఘురామకృష్ణంరాజు


కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ఘట్టం ముగిసింది. అఖండ మెజార్టీతో టిడిపి కూటమి విజయకేతనం ఎగురవేసింది. రెండు జిల్లాల్లోని 14 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. ఈ నెల 12న సిఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు చెబుతున్నారు. అదేరోజు ప్రమాణ స్వీకారం చేసే మంత్రులు ఎవరనేదానిపై తీవ్ర చర్చ సాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధారంగా మంత్రి పదవులు కేటాయిస్తారా.. లేక విభజిత ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రాతిపదికన మంత్రి పదవుల కేటాయింపు ఉంటుందా అనే చర్చ నడుస్తోంది. ఈసారి టిడిపిలో గెలుపొందిన ఎంఎల్ఎ అభ్యర్థుల్లో సీనియర్లు ఉండటంతోపాటు, పొత్తులో జనసేన, బిజెపి సైతం ఉన్నాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి మంత్రి పదవుల కేటాయింపు ఎలా ఉంటుందనే దానిపై పడింది. ఇప్పటికే ఆశావాహులంతా అధినాయకులకు దగ్గరగా ఉండే నేతలను కలిసి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గత టిడిపి ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన పితాని సత్యనారాయణ పేరు మంత్రివర్గరేసులో ప్రముఖంగా విన్పిస్తోంది. ఈయనకు శెట్టిబలిజ సామాజిక తరగతి కోటాలో అవకాశం దక్కనున్నట్లు చెబుతున్నారు. ఈ సామాజిక తరగతిలో గెలిచిన ఎంఎల్ఎల్లో పితాని సత్యనారాయణే అత్యంత సీనియర్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పితానికి మంత్రి పదవి ఖాయమనే ప్రచారం సాగడంతోపాటు ఆయకు బిసి వెల్ఫేర్ శాఖ కేటాయించనున్నట్లు చర్చ సాగుతోంది. గత టిడిపి ప్రభుత్వంలో పితాని కార్మికశాఖ మంత్రిగా పని చేశారు. కాపు సామాజిక తరగతి కోటాలో పాలకొల్లు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎంఎల్ఎగా గెలుపొందిన నిమ్మల రామానాయుడుకు మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పార్టీకి వ్యతిరేకంగా ఆయన అనేక ఆందోళనలు చేసి జిల్లాలో పార్టీకి దిక్సూచిగా మారారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాదరణ పొందిన నేతగా రామానాయుడుకు మంచి పేరు ఉంది. ఎన్నికలకు ముందే టిడిపి గెలిస్తే రామానాయుడుకు మంత్రి పదవి ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. ఎందుకంటే గడిచిన పదేళ్లుగా ఆయన పార్టీ కోసం కష్టపడిన తీరు అందరినీ ఆకట్టుకుంది. రామానాయుడుకు మంత్రి పదవి ఇవ్వకపోతే జనం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే పరిస్థితి ఉంటుందనే చర్చ నడుస్తోంది. నరసాపురం ఎంపీగా పని చేసి ఈసారి ఎన్నికల్లో టిడిపి తరపున ఉండి ఎంఎల్ఎగా గెలిచిన కనుమూరి రఘురామకృష్ణంరాజుకు క్షత్రియ కోటాలో మంత్రి పదవి వరించనుందనే ప్రచారం సాగుతోంది. ఈయనకు మంత్రి పదవి ఇవ్వకపోతే శాసనసభ స్పీకర్ ఇవ్వనున్నట్లు మరో ప్రచారం నడుస్తోంది. అయితే ఈయన నామినేషన్‌కు కొద్దిరోజుల ముందు మాత్రమే టిడిపిలో చేరారు. సీనియర్లను కాదని ఈయనకు ఇస్తారా అనే మరో చర్చ సాగుతోంది. జగన్‌కు ఎదురుతిరిగి చేసిన పోరాటం ఈయనకు కలిసొచ్చే అంశంగా కన్పిస్తోంది. రఘురామకృష్ణంరాజు విషయంలో ఏం జరుగుతుందో వేచిచూడాలి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఐదు స్థానాల్లో జనసేన పోటీ చేసింది. ఐదుచోట్ల ఆ పార్టీ అభ్యర్థులు గెలిచారు. జిల్లాలో అన్ని సీట్లనూ టిడిపి కూటమి గెలుపొందడంలో కాపు సామాజిక తరగతి కీలక పాత్ర పోషించిందనే అభిప్రాయం ఉంది. జనసేన కోటాలోనూ జిల్లాకు ఓ మంత్రి పదవి వస్తుందా అనే చర్చ నడుస్తోంది. ఒకవేళ వస్తే మత్స్యకారుల కోటాలో నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌కు దక్కే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బిజెపి కోటాలో కైకలూరు నుంచి గెలిచిన కామినేని శ్రీనివాస్‌కు కచ్చితంగా మంత్రివర్గంలో అవకాశం ఉంటుందని చెబుతున్నారు. మంత్రి పదవులు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కేటాయిస్తారా లేక విభజిత జిల్లాల ఆధారంగా కేటాయిస్తారా అనేది తేలాల్సి ఉంది. నూజివీడు ఎంఎల్ఎగా గెలుపొందిన కొలుసు పార్థసారథి యాదవ సామాజిక తరగతి కోటాలో మంత్రి అయ్యే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. మంత్రి పదవులపై సీనియర్లంతా ఆశలు పెట్టుకోవడంతో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందోననే ఉత్కంఠ నెలకొంది.

కోలనపల్లి ఒఎన్‌జిసి రిగ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

లీజు సొమ్ము చెల్లించాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కాళ్ల

కోలనపల్లి గ్రామంలో వ్యవసాయ భూముల్లో చమురు నిక్షేపాలు వెలికి తీసేందుకు ఒఎన్‌జిసి ఐదెకరాల స్థలాన్ని 1999లో లీజుకు తీసుకుందని, అయితే 2019 నుంచి లీజు సొమ్ము చెల్లించడం లేదని రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ స్థలానిన ఒఎన్‌జిసి వేరే ప్రయివేటు సంస్థకు లీజుకు ఇచ్చినట్లు తెలిసింది. రాజమండ్రిలోని ఒఎన్‌జిసి అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు అనేకసార్లు విన్నవించినా సొమ్ము మాత్రం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు పది పంటలకు సంబంధించి మొత్తం రూ.10 లక్షల చొప్పున లీజు సొమ్ము ఇవ్వాల్సి ఉందని రైతులు వేగేశ్న సూర్యనారాయణరాజు, జొన్న ముత్యాలు, జొన్న సాయిలక్ష్మి, సిరిగినీడి బాలయేసు, జొన్న గంగరాజు వాపోయారు. చమురు తీసుకెళ్లేందుకు క్రేన్, లారీ వచ్చాయని, ఆయిల్‌ను తీయడానికి వీల్లేదని అడ్డుకున్నామన్నారు. తమకు చెల్లించాల్సిన లీజు సొమ్ము చెల్లించే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

విద్యార్థుల స్థాయిని బట్టి బోధన ఉండాలి

ఆర్‌జెడి జి.నాగమణి

ప్రజాశక్తి - వీరవాసరం

విద్యార్థుల స్థాయిని, వారిలోని లోటుపాట్లను గుర్తించి విద్యాబోధన చేసినప్పుడే విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహిస్తారని ఆర్‌జెడి జి.నాగమణి అన్నారు. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్‌లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా పత్రాల మూల్యంకనం ప్రారంభం సందర్భంగా గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ మూల్యాంకనం జరుగుతున్నందున ఎవరూ సెలవులు అడగొద్దన్నారు. పరీక్షా పత్రాల దిద్దుబాటులో ఎటువంటి పొరపాట్లకు తావివ్వొద్దన్నారు. తరగతి గదుల్లో నిర్వహించే పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులే పబ్లిక్ పరీక్షల్లో కూడా ఫెయిల్ అయ్యారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఉత్తీర్ణతకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలలు తెరిచిన వెంటనే వెనుకబడిన విద్యార్థులను గుర్తించి విద్యాబోధనలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరు నుండి పదో తరగతి వరకు ఎటువంటి బేధం లేని విధంగా ఒకే విధమైన ప్రాధాన్యతతో విద్యా బోధన చేయాలన్నారు. బాగా కష్టపడి పరీక్షలు రాసిన విద్యార్థులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం.శ్రీమన్నారాయణ, ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌జెడిని కలిసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మంత్రి పదవి రేసులో నిమ్మల..!

35 సంవత్సరాల తర్వాత పాలకొల్లుకు అవకాశం దక్కేనా

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గానికి ఈసారైనా మంత్రి పదవి దక్కనుందా అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది. పాలకొల్లు నుంచి నిమ్మల రామానాయుడు వరుసగా మూడోసారి ఎంఎల్ఎగా గెలుపొంది హ్యాట్రిక్ కొట్టారు. పాలకొల్లు నుంచి 1989లో ఎంఎల్ఎగా ఎన్నికైన చేగొండి హరిరామజోగయ్యకు మంత్రి పదవి దక్కింది. ఆ తర్వాత ఆ ఊసే లేదు. మధ్యలో 2009లో ఇక్కడ నుంచి పోటీ చేసిన సినీనటుడు, పిఆర్‌పి అధ్యక్షుడు చిరంజీవిని ఓడించిన బంగారు ఉషారాణికి మంత్రి పదవి దక్కుతుందని ప్రచారం సాగినా ఆ అవకాశం దక్కలేదు. ఈసారి నిమ్మలకు మంత్రి పదవి దక్కితే 35 సంవత్సరాల అనంతరం పాలకొల్లుకు మంత్రి పదవి దక్కినట్లవుతుంది. పాలకొల్లును ఆనుకుని ఉన్న నరసాపురం నియోజకవర్గంలో పలువురు మంత్రి పదవులు చేపట్టారు. నరసాపురంలో కాంగ్రెస్ హయాంలో పరకాల శేషావతారం, టిడిపి హయాంలో జోగయ్య, కొత్తపల్లి సుబ్బారాయుడు పలుమార్లు మంత్రి పదవులు నిర్వహించారు. ముదునూరి ప్రసాద్‌రాజు కూడా ప్రభుత్వ చీఫ్‌విప్‌గా పని చేశారు. పెనుగొండ, ఆ తర్వాత ఆచంట నుంచి పితాని సత్యనారాయణ రెండుసార్లు మంత్రి పదవులు చేపట్టారు. అయితే పాలకొల్లుకు మాత్రం జోగయ్య తర్వాత మంత్రి పదవి దక్కలేదు. 1971లో పాలకొల్లు నుంచి ఎంఎల్ఎగా ఎన్నికైన జోగయ్య 1983లో టిడిపిలో చేరాక నరసాపురం నుంచి ఎన్నికై రాష్ట్ర హోం శాఖా మంత్రిగా పని చేశారు. 1988లో రంగా హత్యానంతరం కాంగ్రెస్‌లో చేరి 1989లో పాలకొల్లు నుంచి ఎంఎల్ఎగా ఎన్నికై రాష్ట్ర సమాచార, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. పాలకొల్లు నుంచి నాలుగుసార్లు ఎంఎల్ఎగా ఎన్నికైన అల్లు వెంకట సత్యనారాయణ మెగాస్టార్ చిరంజీవికి బంధువు కావడంతో టిడిపి హయాంలో మంత్రి పదవి దక్కుతుందని భావించినా మొండిచెయ్యే మిగిలింది. ఆగ్రోస్ ఛైర్మన్ పదవి అల్లుకు కట్టబెట్టారు.

ఇదిలా ఉండగా పాలకొల్లుకు చెందిన డాక్టర్ దాసరి నారాయణరావు కేంద్ర సహాయ మంత్రిగా పని చేశారు. పాలకొల్లులో ఎంఎల్ఎగా ఓడిన సినీనటుడు చిరంజీవి కేంద్ర టూరిజం శాఖ మంత్రిగా పని చేశారు. 2014 నుంచి వరుసగా ఎంఎల్ఎగా ఎన్నికవుతున్న నిమ్మలకు ఈసారి మంత్రి వర్గంలో చోటు ఖాయమనే ప్రచారం పెద్దఎత్తున సాగింది. 2019లో రాష్ట్రంలో జగన్ ఘనవిజయం సాధించినా పాలకొల్లులో మాత్రం నిమ్మల 17,800 ఓట్ల మెజారిటీతో విజయబావుటా ఎగురవేశారు. ఆ కాలంలో అధికారపక్షాన్ని ధీటుగా ఎదుర్కొన్నారనే మంచి పేరుంది. ఈ నేపథ్యంలో నిమ్మల రామానాయుడు మంత్రి కావడం ఖాయమని టిడిపి శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం

పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు



ప్రజాశక్తి - పాలకొల్లు

పెండింగులో ఉన్న పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పాలకొల్లులో పెండింగులో ఉన్న టిడ్కో ఇళ్లను అన్ని సౌకర్యాలతో పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. కేవలం 10 శాతం పనులు పూర్తి చేస్తే టిడ్కో గృహాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. పాలకొల్లును ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు. పాలకొల్లు ప్రజలు తనను మూడోసారి గెలిపించారని, వారి రుణం తీర్చుకుంటానని చెప్పారు. తనకు ప్రజలు 70 శాతం ఓట్లు, 67,945 మెజార్టీ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కేంద్రంలో కూడా మంచి గుర్తింపుతో రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసే అవకాశం దక్కిందన్నారు. రాజధాని, పోలవరం వంటి పనులన్నీ వేగవంతమవుతాయన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే బాధ్యత

తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్



ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం చరిత్రలోనే కనీవినీ ఎరుగని మెజారిటీతో తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధే తన బాధ్యత అని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని బొలిశెట్టి నివాసం వద్ద గురువారం కూటమి నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాన్ని మరిచే విధంగా పాలన సాగిస్తామన్నారు. రానున్న ఐదేళ్లలో పది సంవత్సరాల అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. పేదలకు ఎటువంటి ఆపద వచ్చినా 24 గంటలు తన ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ బొలిశెట్టి శ్రీనివాస్‌కు భారీ మెజార్టీ అందించిన అందరికీ రుణపడి ఉంటామన్నారు. బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులన్నీ తీసుకొచ్చేలా నరసాపురం ఎంపీ శ్రీనివాస్ వర్మ ద్వారా సాధిస్తామన్నారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో విద్యాహక్కు చట్టం అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ కోరింది. ఈ మేరకు ఆ సంఘం నేతలు గురువారం స్థానిక ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కన్వీనర్ శేఖర్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు నిబంధనలకు వ్యతిరేకంగా ముందస్తు అడ్మిషన్లు చేయడమే కాకుండా పుస్తకాలు, యూనిఫారాలు తాము చెప్పిన ప్రదేశంలో మాత్రమే కొనాలని యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్‌డి.జాన్, నేతలు జి.సిరి, ఫణిచౌదరి, బి.పార్వతి, బి.శృతి కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


ఎంఇఒకు వినతిపత్రం సమర్పించిన ఎస్ఎఫ్ఐ నేతలు

ఘనంగా ఆర్ఎస్ 98వ జన్మదిన వేడుకలు

ఆర్ఎస్ జీవితం స్ఫూర్తిదాయకం - సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం - కేక్ కట్ చేయించిన చించినాడ గ్రామస్తులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

98వ వసంతంలోకి అడుగుపెట్టిన సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) జన్మదిన వేడుకలు గురువారం పట్టణంలోని ఎఎస్ఆర్ నగర్‌లో సిపిఎం శ్రేణులు, చించినాడ గ్రామస్తులు, ప్రముఖులు, కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు. తొలుత పట్టణంలో ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ శివశంకర్ ఆర్ఎస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఎం విశాఖ నగర కార్పొరేటర్ బి.గంగారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ ఆర్ఎస్‌ను శాలువాతో సత్కరించారు. చించినాడ గ్రామస్తులు కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రజలందరిచేత, అన్ని రాజకీయ పార్టీల ద్వారా గుర్తింపు పొందిన నాయకుడు, పోరాట యోధుడు ఆర్ఎస్ అని కొనియాడారు. 1967-72 మధ్య నరసాపురం ఎంఎల్ఎగా సేవలందించారని గుర్తు చేశారు. జిల్లాలో మహిళలు, రైతులు, కార్మికులు, శ్రామికుల సమస్యలపై అనేక ఉద్యమాలను నిర్మించారని తెలిపారు. 98 ఏళ్లు నిండినా నిరంతరం ఉద్యమాల పట్ల, ప్రజా సమస్యల పట్ల ఆలోచిస్తూనే అందరి ఆదరాభిమానం పొందిన నేత అని ప్రశంసించారు. ఆదర్శ ప్రజానాయకుడిగా, ప్రజాప్రతినిధులకే ఆదర్శప్రాయుడన్నారు. 98వ ఏట అడుగుపెట్టిన ఆర్ఎస్‌కు అభినందనలు తెలిపారు. ఆర్ఎస్ బలమైన కోరిక శత వసంతాలు పూర్తి చేసుకోవాలని, ఆయన అంతకు మించి ఎక్కువ వసంతాలు చేసుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు కానేటి బాలరాజు, మామిడిశెట్టి రామాంజనేయులు, ఎం.వైకుంఠరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, చించినాడ యూత్, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆర్ఎస్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు, సిపిఎం శ్రేణులు

20న పాలకొల్లులో ఆక్వా రైతుల సదస్సు

సమస్యలు పరిష్కరించాలని నూతన ఎంఎల్ఎలకు వినతిపత్రాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 20న పాలకొల్లులో వివిధ జిల్లాల ఆక్వా రైతులతో భారీ సదస్సు ఏర్పాటు చేసినట్లు జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు చెప్పారు. గురువారం సంఘ కార్యాలయంలో రైతు ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం దారుణంగా తక్కువ ధరకు రొయ్య కొనుగోలు చేస్తున్నారని, దీంతో ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారని చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల రైతులతో సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ సమస్యలను కొత్తగా కొలువుదీరే మంత్రులు, ఎంఎల్ఎల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి బోనం చినబాబు, మేడిది జాన్‌రాజు, కోడి విజయభాస్కర్, పెన్మెత్స సత్యనారాయణరాజు, బోనం రంగనాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గాంధీ భగవాన్‌రాజు

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇవ్వడం లేదు

ఎంఇఒకు తల్లిదండ్రుల ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకొల్లు

కార్పొరేట్ విద్యాసంస్థల్లో పేద మెరిట్ విద్యార్థులకు ఇవ్వాల్సిన 25 శాతం సీట్లు ఇవ్వడం లేదని పలువురు తల్లిదండ్రులు పాలకొల్లు ఎంఇఒకు మొరపెట్టుకున్నారు. గురువారం ఆయనను కలిసి తాము ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నామని, శశి విద్యాసంస్థ వద్దకు వెళ్తే అనేక నిబంధనలు చెబుతున్నారని చెప్పారు. దీనిపై ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. కేవలం కిలోమీటర్ పరిధిలో చదువుకునే విద్యార్థులకే సీటు ఇస్తామని కార్పొరేట్ విద్యాసంస్థలు చెబుతున్నాయని వాపోయారు. అమ్మఒడి సొమ్ము కన్నా అదనంగా సొమ్ము అడుగుతున్నారని ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పట్టణంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా సీట్లు ఇవ్వని విద్యాసంస్థలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని ఎంఇఒ వీరాస్వామి చెప్పారు. దీనిపై శశి విద్యాసంస్థల ప్రతినిధి కిషోర్‌ను మీడియా వివరణ కోరగా విద్యార్థులను చేర్చుకోవడానికి ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టిందని, ఇప్పటివరకు కేవలం ఇరువురు విద్యార్థులే అర్హత సాధించారని చెప్పారు. శుక్రవారం విద్యా సంవత్సరంలో చేరడానికి ఆఖరి తేదీ అయినా తాము అర్హతున్నవారిని చేర్చుకుంటామని ఆయన తెలిపారు.

ఎంఇఒతో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విద్యా కానుక కిట్లు అందించాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 12న స్కూళ్ల ప్రారంభం నాటికి విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందించాలని విద్యాశాఖ ఆర్‌జెడి, పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒ నాగమణి అన్నారు. గురువారం పట్టణంలోని లెనిన్ హైస్కూల్ పదో తరగతి, మిషన్ హైస్కూల్‌లో ఇంటర్ దూర విద్యా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం మిషన్ హైస్కూల్‌లోని విద్యాకానుక గొడౌన్‌లో విద్యాకానుక కిట్లను తనిఖీ చేశారు. స్థానిక ఎంఇఒ పి.పుష్పరాజ్యంతో కలిసి పుస్తకాలు, బెల్ట్, షూల నాణ్యతను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది తాతయ్య, బొక్కా శ్రీను, రవీంద్ర, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలను తనిఖీ చేస్తున్న ఆర్‌జెడి నాగమణి

రఘురామకృష్ణంరాజు గెలుపుపై హర్షం

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గ ఎంఎల్‌ఎగా కనుమూరి రఘురామకృష్ణంరాజు 56,777 ఓట్ల మెజార్టీతో గెలుపొందడం పట్ల పలువురు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. రఘు రామకృష్ణంరాజు అమ్మమ్మ పుట్టిన ఊరు ఏలూరుపాడు కావడంతో గ్రామస్తులు రఘు రామకృష్ణం రాజు గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఎంఎల్‌ఎగా గెలవడం చాలా ఆనందంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఏలూరుపాడు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం వచ్చిందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచి భూపతిరాజు జగ్గరాజు, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు, మాజీ ఎంపిటిసి పడమట సత్యనారాయణ, టిడిపి నాయకులు వక్కపట్ల హరిబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 23వ రోజు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలు ఉత్సాహంగా పాల్గొని పుస్తక పఠనం చేశారు. కథలు చదివించడం, చెప్పించడం, వినిపించడం చేశారు. రిటైర్డ్ హెచ్‌ఎం పొన్నాడ పద్మావతి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని 'సోమరితనాన్ని ఎలా పోగొట్టాలి' అంశంపై మాట్లాడారు. సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగించడం ద్వారా సోమరితనం వస్తుందన్నారు. అనంతరం సమ్మర్ క్యాంపు పిల్లలతో 'చదవడం మాకిష్టం' నినాదాలతో గ్రంథాలయ ప్రచార ర్యాలీ నిర్వహించారు. మే 15 నుంచి జరుగుతున్న శిక్షణ తరగతులకు గాను ఈనెల ఏడో తేదీన అల్లూరి సాంస్కృతి కేంద్రంలో జరిగే ముగింపు సభకు పిల్లలందరు తల్లిదండ్రులు రిసోర్స్ పర్సన్స్ పాల్గొనాలని గ్రేడ్‌వన్ లైబ్రేరియన్ కెజెఎస్‌ఎల్.కుమారి కోరారు. కార్యక్రమంలో పండా త్రినాథ్, రెడ్డప్ప ధవేజీ, శాస్త్రవేత్త సుబ్బారావు, సుధీర్ మోహన్, సూర్యంబాబు పాల్గొన్నారు.

ఉండి : పుస్తక పఠనంతో విద్యార్థుల్లో ఆలోచనాశక్తి పెరుగుతుందని ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని వై.రామలక్ష్మి అన్నారు. ఉండి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వై.రామలక్ష్మి, విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నల్లా సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్ మాట్లాడుతూ 21 రోజులుగా విద్యార్థులు వేసవి శిబిరాన్ని వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి రోజూ విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సెల్‌ఫోన్ వాడకం వల్ల చిన్నారుల్లో దృష్టిలోపం కలుగుతుందన్నారు. గ్రంథాలయ అధికారి జక్కా వెంకట కృష్ణమూర్తి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కతజ్ఞతలు తెలిపారు. అనంతరం 21 రోజుల పాటు జరిగిన శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు, పోటీల్లో పాల్గొన్న సుమారు 40 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పి.శ్యామలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతం : ఆర్‌ఒ

ప్రజాశక్తి - ఆచంట

పోలింగ్ దగ్గర నుంచి ఓట్ల లెక్కింపు వరకూ ఆచంట నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఓటింగ్ లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న అధికారులు రెవెన్యూ, పంచాయతీ, జిఎస్‌డబ్ల్యుఎస్, పోలీసు భద్రతా సిబ్బంది వరకూ ఎంతో నిబద్ధతతో వ్యవహరించారన్నారు. ఎన్నికల అబ్జర్వర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పకడ్బందీగా సమర్ధంతంగా నిర్వహించామన్నారు. తమకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కౌంటింగ్ ఫలితాలు సమాచారం కూడా ఎప్పటికప్పుడు వెల్లడించినట్లు తెలిపారు. సాధారణ ఎన్నికల ప్రక్రియకు సహకరించిన నియోజకవర్గ ప్రజలకు, ఓటర్లకు, సిబ్బందికి, వివిధ శాఖల అధికారులకు, నోడల్ అధికారులకు, తహశీల్దార్లకు, ఎంపిడిఒలకు ధన్యవాదాలు తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రధానోపాధ్యాయులు పి. సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని లింగనబోయిన చర్ల గ్రామంలో జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పర్యావరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులచే ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ పెను భూతాన్ని ఎలా తరమాలి వంటి అంశాలపై విద్యార్థులకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

సురక్షిత తాగునీరు అందించాలి

ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నియోజకవర్గంలోని గ్రామాల్లో సురక్ష తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. గురువారం బొలిశెట్టి శ్రీనివాస్‌ను కలిసేందుకు ఆయన నివాసానికి వచ్చిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఆయన మాట్లాడారు. వేసవి సందర్భంగా గ్రామాల్లో ముందస్తుగా నింపిన తాగునీటి చెరువుల్లో నీరు పసర్లు కట్టిందని, ఆ చెరువులను పరిశీలించి సురక్షిత నీటిని ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు నీటిఎద్దడి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొలిశెట్టిని కలిసిన ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి జానకిరామ్

జనసేన ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ను గురువారం డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి టి.జానకీరామ్ ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యాన విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు, రైతులకు అందిస్తున్న సేవలు గురించి బొలిశెట్టికి వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నదానం

మొగల్తూరు: మొగల్తూరులోని కోట రోడ్డులోని దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. యాత్రికులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ట్రస్ట్, దాతలు జక్కంశెట్టి సత్యనారాయణ రూ.5000, బత్తుల అప్పారావు రూ.3000, వెలిది అప్పారావు కూరగాయలు, పెదమల్లు సూర్యతేజ 10 కేజీల పెరుగు బకెట్లు అన్నదానానికి విరాళంగా అందించారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పోటీ ప్రపంచానికి దీటుగా విద్యాబోధన

ఆదిత్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్

ప్రజాశక్తి - పెనుగొండ

ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యాబోధన సాగిస్తున్నామని, విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడమే తమ లక్ష్యమని శ్రీఆదిత్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ టి.చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయిని కె.శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని సిద్ధాంతం గ్రామంలో 22 సంవత్సరాలుగా ఉత్తమ విద్యనందిస్తున్న విద్యాసంస్థ ఆదిత్య అన్నారు. ఇక్కడ నర్సరీ నుంచి పదో తరగతి వరకూ విద్యాబోధన జరుగుతుందన్నారు. ఉత్తమ శిక్షణ, నిరంతర పర్యవేక్షణ, నిర్విరామ కృషితో 2023 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారన్నారు. పదిలో ఎ.దుర్గాప్రసాద్ 525 మార్కులతో ఫస్ట్ ర్యాంకు సాధించారన్నారు. అలాగే కె.సత్యవర్ధన్ 499 మార్కులు, ఎం.యజ్ఞశ్రీ 489 మార్కులు, కె.పావని సరస్వతి 481 మార్కులు, వై.సాయిశ్రీ 344 మార్కులు, ఎస్.జ్ఞానసుందర్ 333 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. 2002లో ప్రారంభించిన శ్రీఆదిత్య విద్యాసంస్థ దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిందన్నారు. విశేష అనుభవం కలిగిన యాజమాన్యం సారథ్యంలో ఉన్నత ప్రమాణాలు సాధనకై కృషి చేస్తున్న తమ విద్యాసంస్థలో మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి మీ సహాయ సహకారాలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యతమైన విద్యనందించడమే కాకుండా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సందేశాలను నివృత్తి చేస్తున్నామని చెప్పారు. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా తక్కువ ఫీజులతో కార్పొరేట్ విద్యనందిస్తున్న సంస్థ శ్రీ ఆదిత్య హై స్కూల్ అన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఇంగ్లీషులో మాట్లాడేటట్లు చేయడమే తమ సంస్థ ప్రత్యేకత అన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అధునాతనమైన పద్ధతిలో కంప్యూటర్ విద్యా బోధన చేస్తున్నామన్నారు. బట్టీ విధానం కాకుండా సబ్జెక్టుపై పూర్తి అవగాహన వచ్చే విధంగా అనుభవజ్ఞులపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తమ విద్యాసంస్థలో నర్సరీ నుంచి పదో తరగతి వరకూ అడ్మిషన్లు జరుగుతున్నాయని చంద్రశేఖర్ తెలిపారు.

సిద్ధాంతంలో శ్రీఆదిత్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్

స్కూల్ ప్రత్యేకతలు..

- ప్రశాంత వాతావరణంలో స్కూల్, సొంత భవనాలు
- సువిశాలమైన తరగతి గదులు
- అంకిత భావం, అర్హత గల ఉపాధ్యాయులతో విద్యా బోధన
- బాలవికాస్, నైతిక విలువలపై తరగతుల నిర్వహణ
- దస్తూరి, స్పోకెన్ ఇంగ్లీష్‌పై ప్రత్యేక శ్రద్ధ
- అత్యాధునిక వసతులతో డిజిటల్ తరగతుల నిర్వహణ
- లైబ్రరీ, లేబొరేటరీ ఏర్పాటు
- ప్రతి తరగతిలో పరిమిత సంఖ్యలో విద్యార్థులు
- ప్రీ ప్రయిమరీ విద్యార్థుల ప్రత్యేక శిక్షణ
- వెనుకబడిన విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహణ
- ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులతో విద్యాబోధన
- సీసీ కెమెరాలతో తరగతుల పర్యవేక్షణ
- అన్ని గ్రామాలకూ రవాణా సౌకర్యం

జ్వరం వస్తే వైద్య పరీక్షలు చేయించుకోవాలి

డాక్టర్ సంతోష్ నాయుడు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోష్ నాయుడు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా గురువారం గణపవరంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి మాట్లాడుతూ రక్త పరీక్షలు చేయించుకోవడం వల్ల మలేరియా ఉన్నదీ లేనిదీ తెలుసుకోవచ్చున్నారు. మలేరియా ఉన్నట్లయితే వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. ప్రతి శుక్రవారమూ ఇంటి పక్కన తడి లేకుండా పొడిగా ఉంచుకోవడం వల్ల దోమలు పుట్టకుండా ఉంటాయన్నారు. దోమలు పెరిగితే మలేరియా డెంగీ వంటి జ్వరాలు వస్తాయన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించడానికి తమ సిబ్బంది గ్రామాల ప్రజలకు గ్రూప్ మీటింగ్ ద్వారా తెలియపరుస్తున్నామని చెప్పారు. ఈ ర్యాలీలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు ఆశా వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గణపవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్ : వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగా చూసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు సూచించారు. వెంకట్రామన్నగూడెం గ్రామంలో మలేరియాపై అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ రుపాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. దోమలు నీటి నిల్వలు ఎక్కువ ఉన్న ప్రదేశాల్లో వృద్ధి చెందుతాయన్నారు. అందుకే పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆడ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. దీన్ని నివారించడానికి ఫాగింగ్ ఆపరేషన్, స్ప్రేయింగ్ ఆపరేషన్, లార్వా జనిత ప్రదేశాల్లో గుంబుషియ ఫిష్ విడుదల చేయడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి సూర్యకాంతం, ఆరోగ్య పర్యవేక్షకులు జి.పద్మలత, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రామం ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

వల్లూరు గ్రామానికి చెందిన రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణ రాజు తనయుడు మాజీ డివైఎఫ్ఐ నాయకులు ఇందుకూరి రామం 20వ వర్ధంతి వేడుకలను ఆయన ఇంటి వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య పుట్టినరోజును పరిస్కరించుకొని మే ఒకటో తేదీన సూర్యనారాయణ ఇంటి వద్ద రైతు సంఘం జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కిసాన్ సంఘం అధ్యక్షులు రుద్రరాజు రామం ఆశయ సాధనకు, రైతుల సమస్యలపై పోరాడతానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. రైతు భరోసా కేంద్రాల వద్ద అధికారులు తక్షణం వరి వంగడాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఇప్పటికే వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు ఖాళీగా ఉన్నారని, అధికారులు జోక్యం చేసుకుని తక్షణం విత్తనాలను సరఫరా చేస్తే ముందస్తుగా సార్వా సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు.

రామం చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న సూర్యనారాయణ రాజు

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

సార్వాకు సంబంధించి వరి విత్తనాలు పంపిణీ చేసిన ఈ రెండు రోజుల్లో సుమారు నాలుగు వేల మంది రైతులు వచ్చారని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్ అన్నారు. గురువారం విత్తనాల కోసం స్థానిక, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండేగాక, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన రైతులతో మాట్లాడారు. సార్వా సీజన్‌లో పైరు పడిపోని విత్తనాలు అనువుగా ఉంటాయానని, దిగుబడి బాగుంటుందని ఆయన రైతులకు వివరించారు. ఈ సార్వా సీజన్‌కు బాగా అనువైన ఎంటియు 1318 ఫౌండేషన్ విత్తనాలు, ఎంటియు 1318 సత్యప్రమాణ రకం విత్తనాలతో పాటు, స్వర్ణ రకం విత్తనాలను రైతులు ఎక్కువగా కొనుగోలు చేశారని ఆయన వెల్లడించారు. ఈనెల ఏడో తేదీన కూడా విత్తనాలు పంపిణీ చేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నివాళులర్పిస్తున్న గోపాలన్, నేతలు

వ్యక్తిపై హత్యాయత్నం

ప్రజాశక్తి - ఉండి

టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్నపై గురువారం సాయంత్రం హత్యాయత్నం జరిగింది. దీనికి సంబంధించి ఆకివీడు సిఐ కెవివిఎన్ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి గ్రామానికి చెందిన నాగరాజు, మురాల నాగబాబు, సాయి ఈ ముగ్గురు యువకులు మండలంలోని ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామానికి చెందిన కిన్నెర వెంకన్న ఇంటికి వెళ్లి ఆయనపై కత్తితో దాడి చేయడానికి యత్నించారు. వెంకన్న ప్రతిఘటించడంతో అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించగా సాయి అనే యువకుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగిలిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. నాగరాజు భార్యతో కిన్నెర వెంకన్న సంవత్సర కాలంగా ఫోన్లో మాట్లాడుతున్నాడని, ఇద్దరి మధ్య సంబంధం ఉందనే అనుమానంతో నాగరాజు వెంకన్నపై పగ పెంచుకుని గురువారం సాయంత్రం వెంకన్నపై కత్తితో దాడిచేసే ప్రయత్నం చేశాడని తెలిపారు. దీనికి సహకరించిన నాగబాబు, సాయిపై కూడా వెంకన్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనకు ఎటువంటి రాజకీయ వైషమ్యాలు లేవని, కేవలం అనుమానంతోనే హత్యాప్రయత్నం జరిగిందని సిఐ సత్యనారాయణ తెలిపారు.

నీతి, నిజాయతీకి మారుపేరు వెంకటపతిరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కీర్తిశేషులు కలిదిండి వెంకటపతిరాజు ఏడో వర్ధంతి సుందరయ్య భవనంలో గురువారం నిర్వహించారు. తొలుత వెంకటపతిరాజుకు నివాళులర్పించి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కలిదిండి వెంకటపతిరాజు ఉద్యోగ విరమణ తర్వాత సిపిఎం పట్టణ కమిటీ సభ్యులుగా, రైతుసంఘం నాయకులుగా పని చేసి సేవలందించారన్నారు. ఆయన నీతికి, నిజాయతీకి మారుపేరని కొనియాడారు. తాను ఉద్యోగం చేసే సమయంలో తోటి ఉద్యోగులకు అన్యాయం జరిగితే ఉన్నతాధికారులను నిలదీసేవారన్నారు. ప్రతిఒక్కరూ వెంకటపతిరాజు ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అప్పుడే ఆయనకు ఘనమైన నివాళులు అర్పించినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు డి.త్రిమూర్తులు వడుగు వెంకటేశ్వరరావు, రత్నకుమారి, గంగరాజు, అన్నం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తొలకరి వర్షం : సాగుకు సన్నద్ధం

ప్రజాశక్తి - కాళ్ల

వేసవి ఉష్ణ తాపానికి నెర్రలు వారిన నేలలు తొలకరి వర్షంతో చల్లబడి పులకించాయి. ఇటీవల కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు భూతాపాన్ని తగ్గించి వాతావరణాన్ని చల్లబర్చాయి. ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరిన తరుణంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం చల్లబడింది. చెట్లు, పక్షులు, సమస్త జీవరాశికి వర్షం ఉపశమనం కలిగించింది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు వేసవి ఎండల తాపానికి అల్లాడిపోయారు. ఇక పంట పొలాలు నెర్రల వారి నీటి చుక్క కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి తప్పింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. సేద్యానికి సిద్ధమయ్యేందుకు తొలకరి అనుకూలిస్తుందనే సంకేతంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాళ్లలో దుక్కులు చేపడుతున్న రైతులు

మండలంలోని పలు గ్రామాల రైతులు వేసవి దుక్కులు ప్రారంభించారు. సాధారణంగా కొంతమంది రైతులు దాళ్వా వరిపైరు కోసిన తర్వాత దుక్కులు దున్నుకోకుండా ఉండటం వల్ల ఖరీఫ్ సీజన్లో వేసిన పంటలకు తగిన మొత్తంలో పోషక లభ్యత ఉండదు. రైతులు ఆశించిన పంట దిగుబడి పొందలేరు. దీని నివారణకుగానూ వేసవిలోనే దున్నుకోవడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు రైతులకు చెబుతున్నారు. దుక్కులు లోతుగా దున్నాలని సూచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో కాళ్ల మండలంలోని పలు మెట్ట ప్రాంతాల్లో కొందరు రైతులు తమ పొలాల్లో దుక్కులు ప్రారంభించారు. లోతుగా దున్నుకోవడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూలంగా ఉండటంతో పాటు భూమి ఎక్కువగా తేమను గ్రహించి నిల్వ చేసుకుని సామర్థ్యం పెరుగుతుంది. దీని ప్రభావం తర్వాత పంటల దిగుబడిపై చూపుతుంది. తుంగ గరిక వంటి మొండి జాతి కలుపు మొక్కలు పొలంలో అధికంగా పెరిగే పంటలను నాశనం చేస్తూ ఉంటాయి. వేసవిలో దుక్కులు లోతుగా తీయడంతో పొలాల్లోనే చీడపురుగులు నాశనమయ్యే అవకాశం ఉన్నందు వల్ల రైతులు అధికారుల సూచన మేరకు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ : జెసి

ఉండి: సార్వత్రిక ఎన్నికలు-2024 నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో వివిధ శాఖల సహాయ, సహకారాలు, భాగస్వామ్యం మరువలేనిదని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ పత్రాల దాఖలు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. విజయవంతంగా ఓట్ల లెక్కింపు నిర్వహణకు సూచనలు, సలహాలు అందజేసిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు జెసి సివి.ప్రవీణ్ ఆదిత్య ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉండి నియోజకవర్గ పరిధిలో అన్ని శాఖలూ సమన్వయం, సమిష్టి కృషితోనే సాధ్యమైందని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. సుమారు 6 నెలల నుంచి బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారని తెలిపారు. పోలింగ్ తర్వాత కౌంటింగ్ కూడా డిబ్రీఫింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగిందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ శిస్టు రవీంద్రది ప్రధాన పాత్ర అని తెలిపారు.

నాయకర్‌లకు ఎన్ని ఓట్లు వచ్చాయంటే..

నరసాపురం: నరసాపురం నియోజకవర్గ నుంచి 11 మంది అభ్యర్థులు ఉండగా వారిలో ముగ్గురు నాయకర్‌లు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో జనసేన నుంచి బొమ్మిడి నాయకర్ (గ్లాస్ గుర్తు)కు 94,116 (64.72) శాతం ఓట్లు వచ్చాయి. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొల్లి సత్యనాయకర్ (బకెట్ గుర్తు)కు 1172 (0.81) శాతం ఓట్లు దక్కాయి. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి పాలెపు సత్యనాయకర్ (పెన్‌స్టాండ్ గుర్తు)కు 343 (0.24) శాతం ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం నరసాపురంలో బొమ్మిడి నాయకర్‌తో మిగిలిన నాయకర్లకు ఎన్ని ఓట్లు వచ్చాయని చర్చికుంటున్నారు.

జిల్లాలో 34.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

నరసాపురం: జిల్లాలోని బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకూ పలు మండలాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం పడింది. ఈ నేపథ్యంలో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. అత్యధికంగా నరసాపురం 80.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా పోడూరు మండలంలో 10.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొగల్తూరులో 63.2 మిల్లీ మీటర్లు వర్షపాతం, జిల్లాలో మొత్తం 20 మండలాలకు గాను 685.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైందని అధికారులు తెలిపారు. జిల్లాలో సగటు వర్షపాతం 34.3 మిల్లీ మీటర్లు నమోదైంది.

రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలి

ప్రముఖ శిల్పి దేవికా రాణి ఉడయార్

పెనుమంట్ర: ఇటీవల రాష్ట్రంలో వెలువడిన ఎన్నికల ఫలితాల్లో విజయ దుందుభి మోగించిన కూటమి సారథులు చంద్రబాబు నాయుడుకు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందరేశ్వరికి అంతర్జాతీయ తొలి తెలుగు మహిళా శిల్పి, శిల్పకళా రత్న డి.దేవికారాణి ఉడయార్ గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మార్టేరులో విలేకరులతో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలందరికీ సుభిక్ష పాలన అందించాలని కోరారు. విజయం సాధించిన పితాని సత్యనారాయణకు, శ్రీనివాస్ వర్మకు, రఘురామకృష్ణంరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఒరిజినల్ పాసుపోర్ట్ పోయినది

గొట్టుముక్కల జయశ్రీ వల్లి D/o. సత్యసూర్యనారాయణరాజు, డోర్‌నెం.1-93/1, ఆంజనేయ స్వామి గుడివద్ద, జక్కరం, కాళ్ళమండలం, పశ్చిమగోదావరి జిల్లా అనునేను తెలియ జేయునది ఏమనగా

నా యొక్క నెం. W8073657 నెంబరు గల పాస్‌పోర్టు ది. 01.06.2024న తారీఖున పాస్‌పోర్ట్ జిరాక్స్ కొరకు ప్రస్తుతం నివాసం వుండున్న A.S.R నగర్ నుండి అడ్డవంతెన దగ్గరకు వస్తుండగా మార్గ మధ్యమంలో పాస్‌పోర్ట్ పెట్టిన కవరు జారిపడి పోయినది. నా యొక్క పాస్‌పోర్ట్ దొరికిన వారు దయచేసి పై అడ్రస్సుకు సంప్రదించగలరు

గొట్టుముక్కల జయశ్రీ వల్లి
D/o. సత్యసూర్యనారాయణరాజు, సెల్: 9912344196

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు నందు
E.P. No. 55/2018 in
O.S. No. 245/2008

Between:
పులగం వెంకట సత్యనారాయణరెడ్డి
-డి. హెచ్. ఆర్./వాది
మరియు
పడవల శివన్నారాయణ (died) వగైరా
-జే. డి. ఆర్స్/ ప్రతివాదులు

టు:
శ్రీమతి పడవల లలితా భ్రమరాంబికా కుమారి, భర్త: శివన్నారాయణ, మొగల్తూరు, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావా డిక్రీ ప్రకారం నమూనా క్రియ దస్తావేజు ప్రకారం క్రియ దస్తావేజును వ్రాయించి రిజిష్టర్ చేయించి ఇప్పించగలందులకు కోరుతూ వారంటు అమలు గ్రంథమును పై డిక్రీ హోల్డరు దాఖలు చేయగా కోర్టు వారు మీకు Or. 21 Rl.22 నోటీసులు ఎన్నిమార్లు పంపించిననూ మీరు తీసుకొనకుండ కాలయాపన చేయుచున్నందున పై నెంబరు గ్రంథములో మీ పై పేపర్ ప్రకటన ద్వారా నోటీసు అమలు చేయుటకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. సదరు గ్రంథములో మీరు **19-06-2024వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥ల** నుండి స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలియజేసుకొనుటకు వాయిదా వేసినారు. కావున మీరు ఆరోజున హాజరై అభ్యంతరములు తెలియజేసుకోవలెననిన్నీ, లేనిచో సదరు వారంటు అమలు గ్రంథము మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

సరిపల్లి రామ సత్తయ్య
నర్సాపురం — అడ్వకేట్, నర్సాపురం
ది.06-06-2024 — సెల్: 9848837555